డీఈఓకి జిప్సా నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) సభ్యులు గురువారం జిల్లా విద్యా శాఖాధికారి యస్.ప్రేమ్‌కుమార్‌ని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పాఠశాలలోని అందరి విద్యార్థుల ఆపార్ వెంటనే చేయించాలని, ఈ నెలలో జరగబోయే ప్రధాన మంత్రి పరీక్ష పే చర్చా కార్యక్రమంలో 6-10వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొనే విధంగా ఆన్లైన్ రిజిస్ట్రేషన్స్ చేయించాలని సూచించారు. డీఈఓని కలిసిన వారిలో జిప్సా గౌరవ అధ్యక్షులు పి.భాస్కరరావు, అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, కార్యదర్శి యస్.షణ్ముఖరావు, కోశాధికారి ఎం.బాబురావు, సలహాదారు పి.మురళీసుందరరావు, ఉపాధ్యక్షులు యమ్.సత్యన్నారాయణ, బి.చంద్రమౌళి, మాధవరావు తదితరులున్నారు.

ఆరిలోవ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ: ఆరిలోవ మైదానంలో ఆరిలోవ ప్రీమియర్ లీగ్ పోటీలను వీఎమ్మార్డీఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ గురువారం ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఆరిలోవ ప్రీమియర్ లీగ్ పోటీల్లో మొత్తం 8 జట్లు పాల్గొంటున్నాయి. పోటీలు ప్రారంభించిన వీఎమ్మార్డీఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని సూచించారు. శనివారంతో ఈ పోటీలు ముగుస్తాయని నిర్వాహకులు యాసిన్, జగదీశ్‌లు తెలిపారు.

ఉక్కు కార్మికులకు జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ కార్మికులకు గడిచిన నాలుగు నెలలుగా జీతాలు చెల్లించక పోవడం అన్యాయం అని వేలాది ఎకరాలు స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూములు ఇచ్చిన నిర్వాశిత ఉద్యోగులు, ఒప్పంద కార్మికులు జీతాలు లేక పస్తులు ఉంటున్నారని మానవ హక్కుల కౌన్సిల్ శ్యాంప్రసాద్‌కు నిర్వాసితులు విజ్ఞప్తి చేశారు. జీతాలు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో నిర్వాసిత నాయకులు గోండేశీ మహేశ్వర రెడ్డి, గోండేశీ సత్యారావు, అప్పలరెడ్డి, మంత్రి గోపి నారాయణ, యేల్లేటి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కొమ్మాది: ఆత్మగౌరవం, సమానత్వం, కులనిర్మూలన లక్ష్యంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట

సంఘం (కేవీపీఎస్) పోరాడుతుందని సంఘం మధురవాడ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.పైడితల్లి, జి.కిరణ్ తెలిపారు. కేవీపీఎస్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం కార్యకర్తలు, నగర కార్యదర్శి ఎంవి ప్రసాద్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పైడితల్లి, కిరణ్ మాట్లాడుతూ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మన దేశంలో బీజేపీ అధికారం చేపట్టినప్పటి నుండి దళితులు, గిరిజనులు, మహిళలు, వెనుకబడిన వర్గాల ప్రజలపై అన్ని రకాలుగా దాడులు పెరిగాయని అన్నారు. ప్రజల సంపదను, కార్పొరేట్ గెద్దలకు గుండగుత్తగా దోచి పెడుతున్నారని అన్నారు. హక్కుల సాధన కోసం పోరాటాలు ఉధృతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ కార్యకర్తలు డి.అప్పలరాజు, ఎస్.ప్రసాద్, సిహెచ్ శేషుబాబు, బి.రాంబాబు, కె.కొండమ్మ, పి.జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సీఎం రమేష్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర - పెందుర్తి: అనకాపల్లి పార్లమెంటు సభ్యులు, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్‌కు బిజెపి నేత, జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, బిజెపి పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె

రామునాయుడు తదితరులు గురువారం ఉదయం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనకాపల్లి ఎంపీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బిజెపి (చినముషిడివాడ మండల) 95, 97వ వార్డుల అధ్యక్షులు చిక్కాల సతీష్, కంచిబోయిన వెంకట సంతోష్, రాపర్తి దుర్గా ప్రసాద్, బొబ్బర నాగరాజు, కొప్పు గంగరాజు, కొత్తపల్లి అప్పలరాజు, కె.మాధవి, కేవిఆర్.లక్ష్మి, భవాని పాల్గొన్నారు.

సామాన్య భక్తులే ముఖ్యం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి ఉత్తర ద్వార దర్శనంకు సంబంధించి ఈఓ వి.త్రినాధరావు ప్రకటన విడుదల చేశారు. తేది.10.01.2025 న ఉత్సవాన్ని పురస్కరించుకొని దేవస్థానం అధికారులు, పోలీసు అధికారులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో సింహగిరిపై ఎటువంటి ఇబ్బందులు జరగకుండా ఉండేందుకు, భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా శ్రీస్వామి వారి ఉత్తర ద్వార దర్శనం కల్పించడానికి దేవస్థానం వారు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ముఖ్యంగా ప్రతి భక్తుడూ, క్యూలైన్లో నడుస్తూనే కనీసం 15 నిమిషముల పాటు స్వామి, అమ్మవార్లను కనులారా వీక్షిస్తూ ఉత్తర ద్వార దర్శనం చేసుకొనే విధంగా ఏర్పాట్లు

చేయుచున్నారు. ప్రొటోకాల్ పరిధిలోకి వచ్చే వి.ఐ.పి.ల కోసం ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఉత్తర ద్వార దర్శనం కొరకు ఉద్దేశించబడిన రూ.500/-ల ప్రత్యేక టిక్కెట్లు తేది.10.01.2025 ఉదయం గం.5.00ల నుండి ఉదయం గం.10.30ల వరకు కొండపై టిక్కెట్టు కౌంటరు (పాత పి.ఆర్.ఓ ఆఫీస్) నందు విక్రయించబడునని తెలిపారు.

నిబద్ధత గల నేత ఎబి బర్దన్

సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ: నీతి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం కామ్రేడ్ ఎబి బర్దన్ అని సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. అల్లిపురం సిపిఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన బర్దన్ 9వ వర్ధంతిలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ కామ్రేడ్ ఎబి బర్దన్ స్వతంత్ర ఉద్యమ తొలినాళ్లలోనే విద్యార్థి ఉద్యమం (ఎ ఐ ఎస్ ఎస్) ద్వారా కమ్యూనిస్టు ఉద్యమంలోకి ప్రవేశించి కార్మిక సంఘాల నిర్మాణం ద్వారా అఖిల భారత విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా పనిచేశారని తెలిపారు. నాలుగు దశాబ్దాలకుపైగా అఖిల భారత రక్షణ రంగం ఉద్యోగుల ఫెడరేషన్ నిర్మాణంలో కీలక భూమిక పోషించారని చెప్పారు. ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శిగా దశాబ్ది కాలం పనిచేశారని తెలిపారు. 1996 నుండి 2012 వరకు 16 సంవత్సరాలపాటు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారన్నారు. నిబద్ధత గల కమ్యూనిస్టుగా ఉద్యమ ఐక్యత కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె అచ్యుతరావు, సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు కె.సత్యనారాయణ, ఆర్ శ్రీనివాసరావు, ఎం.మన్మధరావు, పి.చంద్రశేఖర్, జి కాసులరెడ్డి, ఎన్ సూరిబాబు, ఎన్.నాగభూషణం, వై.రాంబాబు, కె.అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

భీమిలి అభివృద్ధి దిశగా ప్రణాళికలు: ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - భీమిలి: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో సముద్ర తీర ప్రాంతంగా, పర్యాటక ప్రాంతంగా, ఐ.టి. ప్రాంతంగా అంతర్జాతీయ విమానాశ్ర యానికి అతి సమీపంలోనున్న భీమిలి తీర ప్రాంతాన్ని అభివృద్ధికి ప్రణాళికలను చేపట్టాలని జీవీఎంసీ భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన జోన్-1 భీమిలి జోనల్ కార్యాలయంలో జోన్ 1,2,8 లకు సంబంధించి భీమిలి నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాలపై జీవీఎంసీ నిర్వహించిన సమీక్షా సమావేశానికి జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమీక్షా సమావేశంలో ముందుగా జోన్ 1, 2 లకు సంబంధించి రోడ్లు, కాలువలు, వీధిలైట్లు పార్కులు, శ్మశాన వాటికలు, మంచినీటి సరఫరా, సామాజిక భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, లేఅవుట్ ఓపెన్ స్పేస్‌లు తదితర మౌలిక సదుపాయాల కల్పన, మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి తదితర కార్యక్రమాలపై సంబంధిత ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శాసనసభ్యులకు వివరించారు. గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలి, తగరపువలస ప్రాంతాల్లో అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తూ, అంతర్జాతీయ విమానాశ్రయం సముద్ర తీర ప్రాంతం, పర్యాటక ప్రాంతం, ఐటి ప్రాంతంగా భీమిలి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, ప్రత్యేక ప్రాధాన్యతగా భీమిలి అభివృద్ధికి జి.వి.ఎం.సి. ప్రణాళికలు చేపట్టాలన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్లను విస్తరణ చేసేటప్పుడు ఆస్తులు ఎక్కువగా కోల్పోకుండా, ప్రజలు నష్టపోకుండా, అన్ని విధాలుగా ప్రణాళికలు చేపట్టి అవసరమైన మేరకు మాత్రమే కావలసిన అడుగుల రోడ్ల విస్తరణ జరపాలన్నారు. భీమిలి ప్రాంతంలో నీటి సరఫరా సంతృప్తికరంగా లేనందున పూర్తిస్థాయిలో సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేశామని, మధురవాడలో భూగర్భ మురుగనీటి కాలువల పనులు పూర్తి చేస్తామని, ఇప్పటికే వార్డు కార్పొరేటర్లు ప్రజా ప్రతినిధులు సమర్పించిన పలు అభివృద్ధి పనులకు 24 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, 130 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ కేబుల్ వేస్తున్నామని కమిషనర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జనసేన పార్టీ ఇన్చార్జ్ సందీప్, బిజెపి ఇంచార్జ్ రామానాయుడు, కార్పొరేటర్లు లొడగల అప్పారావు, పిసిని వరాహ నర్సింహం, గాడు చిన్ని కుమారి లక్ష్మి, పిల్లా మంగమ్మ, అదనపు కమిషనర్ ఆర్.సోమనారాయణ, ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాదరాజు, జోనల్ కమిషనర్లు, వి.ప్రసన్న వాణి, ఎం.వి.డి. ఫణిరామ్, హేమవతి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, పిడి-యు.సి.డి. పి.ఎం.సత్యవేణి, డిసిఆర్ ఎస్.శ్రీనివాస్. పర్యవేక్షక ఇంజనీర్ శాంసన్ రాజు, కార్యనిర్వాహక ఇంజనీర్లు ఏడుకొండలు, రత్నాకర్ రెడ్డి, శ్రీధర్, శాంతిరాజ్, డీసీపీ హరిదాస్, ఏసీపి లు రామకృష్ణ, తిరుపతిరావు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

తెలుగును కాపాడే భాధ్యత బడుగులకేనా..?

తెలుగు మహాసభల తీర్మానంపై ప్రశ్నించిన విదసం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: తెలుగు భాషా వికాసం ముసుగులో బడుగుల విద్యా భవిష్యత్తును నాశనం చేయొద్దని, ప్రభుత్వ స్కూల్స్‌లో ఇంగ్లీషు మాధ్యమం ఆపేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలు అంగీకరించరని విదసం ఐక్య వేదిక రాష్ట్ర సమితి కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు హెచ్చరించారు. ఇటీవలి జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల తీర్మాణాలు, చర్చల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం రద్దు చేయాలనే అంశం ప్రస్తావనకు వచ్చిన నేపథ్యంలో ఆ తీర్మానాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవద్దని ఇంగ్లీష్ మీడియం కొనసాగించాలని విదసం నేతృత్వంలో దళిత సంఘాలు పత్రికా సమాసంలో డిమాండు చేశాయి. ఈ సమావేశంలో వెంకటరావు మాట్లాడుతూ జగన్ పాలనపై జరిగిన పోరాటంలో దళితులు అగ్రభాగాన నిలబడ్డారని, దాంతో కుటమి విజయం సాధించిందన్నారు. కూటమికి అండగా నిలబడ్డ బడుగుల పిల్లలకు ఇంగ్లీష్ మీడియం దూరం చేయొద్దని హితవు పలికారు. తెలుగు మహాసభల్లో ఇంగ్లీష్ మీడియంపై విషం కక్కిన వారి పిల్లల, మనవలు ఎక్కడ చదువుతున్నారని ప్రశ్నించారు. ఇంగ్లీష్ మీడియం రద్దు కోరేవారు ఎవరూ బడుగు వర్గాల ప్రతినిధులు కాదన్నారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ తాను జగన్ బాధితుడు అని ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం వద్దనడం సముచితం కాదని, ఇది రాజకీయ వైరం తప్ప తెలుగు భాష రక్షణ కాదని వెంకట రావు తప్పు పట్టారు. తెలుగు భాష రక్షణ కోసం ప్రభుత్వ విద్యలో ఇంగ్లీషు మీడియం రద్దు పరిష్కారం కాదన్నారు. తెలుగు భాషా వికాసం కోసం ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో అన్ని విభాగాల్లో తెలుగును ప్రధాన సబ్జెక్టుగా చేర్చాలని, ప్రభుత్వ ఉత్తర్వులు, కోర్టు తీర్పులు, పోలిసు ఎఫ్ఐఆర్‌లు, చార్జీ షీట్లు తెలుగులో రావాలని డిమాండ్ చేశారు. సోడదాసి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాజి ఓంకార్, బూల భాస్కరరావు, గొల్ల మాల అప్పారావు, వి.దుర్గారావు, మూర మహేష్, కస్తూరి వెంకటరావు, రవి సంతోష్, రవి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునికీకరణలో భారతీయ కళారూపాల సంరక్షణ అవసరం

విశాలాంధ్ర - మధురవాడ: భారతదేశం యొక్క సంపన్న సాంస్కృతిక వారసత్వం, విభిన్న సంప్రదాయాలు ఆధునిక ప్రపంచంలో ప్రమాదంలో ఉన్నాయనే ఆందోళనను అమెరికా పండితురాలు, నర్తకి, రచయిత డాక్టర్ రొక్సాన్న కామయాని గుప్త వ్యక్తం చేశారు. "ఆధునిక భారతీయ కళలు - సాంప్రదాయాల పరిరక్షణ" అనే అంశంపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఫైన్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డాక్టర్ గుప్త మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ కళారూపాలు దేశ సాంస్కృతిక సారాన్ని పరిరక్షించే ప్రధాన మూలాలని ముఖ్యంగా ఆధునిక భారతీయ కళలు, సంస్కృతిని ప్రపంచవ్యాప్తం చేయడంలో దోహదపడ్డాయన్నారు. భారతదేశ కళా రూపాలలో అంతర్లీనంగా భారత తత్వశాస్త్రం, యోగా విలువలు నిండివున్నాయని ఇవి భారతదేశ గొప్పదనాన్ని అద్భుతంగా విశ్వవేదికపై ప్రతిపాదించగల రాయబారాలుగా పనిచేశాయన్నారు. భారతీయ నృత్యరూపాలు ప్రజల ఆలోచనాశక్తిని ప్రతిబింబిస్తూ, శారీరక ఆరోగ్యం, మానసిక శ్రేయస్సును ప్రోత్సహించడంలో ప్రత్యేకంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో గీతం ఫైన్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.మాల్యద, విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ ప్రొఫెసర్ బాలకుమార్, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ నళిని బిక్కిన తదితరులు పాల్గొన్నారు.

నెలరోజుల్లో రేవళ్లపాలెం టీడీఆర్‌లు: ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - పీఎం పాలెం: చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం టీడీఆర్‌లను నెలరోజుల్లో అందజేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌తో కలిసి గురువారం రేవళ్లపాలెంలో పర్యటించారు. 2014- 19 మధ్యలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు హైవే నుంచి బక్కన్నపాలెం వెళ్లే మెయిన్ రోడ్డు విస్తరణ చేపట్టామని చెప్పారు. అక్కడక్కడ పెండింగ్‌లో ఉన్న విస్తరణ పనులను అయిదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శిం చారు. రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చిన ఇళ్ల డెబ్రిస్ తొలగించకుండా స్థానికులు ఆందోళన చేసినా గత ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. టీడీ ఆర్‌లు మంజూరు చేసి సమస్య పరిష్కరిస్తానని ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేరుస్తున్నానని తెలిపారు. హైదారా బాద్‌లోని గచ్చిబౌలి, మాదాపూర్ మాదిరిగా మధురవాడ ప్రాంతం శరవేగంతో అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రణాళిక ప్రకారం మౌలిక సౌకర్యాలు కల్పించకపోతే మురికివాడలు తయారవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యపై స్పందించి త్వరితగతిన పరిష్కారం చూపించిన సంపత్ కుమార్ లాంటి డైనమిక్ అధికారులు విశాఖకు అవసరమన్నారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, కార్పొరేటర్లు మొల్లి హేమలత, లొడగల అప్పారావు, పిల్లా మంగమ్మ, కూటమి నాయకులు పంచకర్ల సందీప్, జీవన్ కుమార్, పిల్లా వెంకట్రావు, మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, గరే గుర్నాథ్, శాఖారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌లో రికార్డు స్థాయిలో కంటి శస్త్ర చికిత్సలు

విశాలాంధ్ర - పెందుర్తి: ఉత్తరాంధ్ర జిల్లాల్లో నాణ్యమైన కంటి వైద్య సేవల్లో పేరుగాంచిన నాయుడు తోట శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ 2024వ సంవత్సరంలో అద్భుత పనితీరు కనబరిచి 33 వేల175 మందికి కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి ఘనత సాధించిందని ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ (పిఆర్) కే.బంగార్రాజు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఇందులో 68 శాతం రోగులకు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ / డాక్టర్ ఎన్.టి.ఆర్ వైద్య సేవ ద్వారా కంటి పరీక్షలు, కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి పేదల జీవితాలలో వెలుగులు నింపి సమాజసేవలో శంకర్ ఫౌండేషన్ ముందంజలో నిలిచిందని ఆయన తెలిపారు. అదే సమయంలో లక్ష 96 వేల 148 మంది ఔట్ పేషెంట్స్‌కు కంటి వైద్యం అందించి అంధత్వ నివారణకు కృషి చేసిందని బంగార్రాజు వెల్లడించారు. నూతన సంవత్సరం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అద్భుత పనితీరు ప్రదర్శించిన హాస్పిటల్ వైద్యులు, సిబ్బందిని మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణ కుమార్, జనరల్ మేనేజర్ కే.రాధాకృష్ణన్ ప్రశంసించి 2025లో మరింత ప్రగతి సాధించి నూతన శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా హాస్పిటల్ ఔట్ రీచ్ టీం ఉత్తరాంధ్ర జిల్లాల్లో 505 ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి 34,305 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 12,903 మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిం చిందని, హాస్పిటల్ ఉచిత రవాణా ద్వారా ఆయా గ్రామాలకు రోగులను తరలించినట్లు బంగారు రాజు చెప్పారు. శ్రీకాకుళం, మద్దిలపాలెం, మధురవాడ, గాజువాకలో గల శంకర్ ఫౌండేషన్ కంటి హాస్పిటల్స్ శాఖలు అద్భుత పనితీరు సాధించి సమాజ సేవలో నిమగ్నమై వేలాదిమంది జీవితాలలో ఆశాజ్యోతిని నింపాయని తెలిపారు. 2024 లో అనేక ఆధునిక కంటి వైద్య సదుపాయాలు, ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు సమకూర్చి రోగుల సేవలకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని, ఈ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఉద్యోగులలో సంతోషాన్ని నింపి, అత్యధిక ఉత్పాదకతకు దోహద పడిందన్నారు. ఈ కొత్త సౌకర్యాలు మెరుగైన శస్త్రచికిత్స అందించడంతోపాటు, వేగవంతమైన చికిత్సలకు దోహదపడ్డాయని, శస్త్రచికిత్స తర్వాత రోగులందరికీ నాణ్యమైన దృష్టిని పొందగలిగారని ఆయన తెలిపారు.

ఏబి బర్దన్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ప్రజల పక్షాన ఎన్నో ఉద్యమాలు చేసి తన జీవితాంతం పోరాడిన యోధుడు సిపిఐ జాతీయ సమితి పూర్వ ప్రధాన కార్యదర్శి ఏ.బి.బర్దన్‌కు గాజువాక నియోజక వర్గ సీపీఐ సమితి ఘన నివాళులు అర్పించింది. గురువారం పెద గంట్యాడ

పోతిన సన్యాసిరావు భవన్‌లో ఏ.బి.బర్ధన్ 9వ వర్ధంతి ఘనంగా జరిగింది. బర్ధన్ చిత్ర పటానికి సిపిఐ కార్యకర్తలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ గాజువాక నియోజక వర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ఏ.బి బర్దన్ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరు సాగించారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ నాయకులు కె.అచ్యుతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు పల్లేటి పోలయ్య, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, కె.పోతయ్య, అప్పారీ విష్ణు మూర్తి, పి.దుర్గారావు, వై.దేముల్లు పాల్గొన్నారు.

పెందుర్తి : భారత కమ్యునిస్టు పార్టీ (సిపిఐ) మాజి జాతీయ ప్రధాన కార్యదర్శి అర్ధేందు భూషణ్ బర్ధన్ 9వ వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు గురువారం ఘన నివాళులు అర్పించారు. జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ సమీపంలోని బర్ధన్ నగర్ కాలనీలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సంధర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బర్ధన్ సాగించిన ఉద్యమాలు,పోరాటాలు, ప్రజా సేవకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు వై రాంబాబు, కాలనీ పార్టీ కార్యదర్శి అన్నపూర్ణ, పార్టీ సభ్యులు అరుణ,పరశురామ్,మిన్నారవు,అనురాధ, దుర్గారావు, తాతారావు తదితరులు పాల్గొని బర్ధన్‌కు నివాళులర్పించారు.

హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసి సభ్యులకు శిక్షణ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పద్మనాభం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన యాజమాన్యం కమిటీ ఏర్పాటు బాధ్యతలు, బాలల హక్కుల పరిరక్షణ, పాఠశాలల యాజమాన్య కమిటీ సమావేశాల నిర్వహణ, పాఠశాలల అభివృద్ధి ప్రణాళిక, సామాజిక తనిఖీ, పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం సమకాల సమస్యల పరిష్కారంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓలు రమణ, బాబూలాల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, ఎస్ఎంసి సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసి సభ్యులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాడ్యూల్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ వి.శ్రీని వాసరావు, కే ప్రసాద్, బి శ్రీనివాస్ పాత్రో, అముజూరి ఈశ్వరరావులు ముఖ్యంగా మత్తుపదార్థాలను నిషేధించాలని ప్రతిజ్ఞ చేశారు. స్థానిక ప్రధానోపాధ్యాయురాలు బాలామణి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ

విశాలాంధ్ర - సాగర్‌నగర్: ఎనిమిదవ వార్డు పరిధి గ్రామీణ మండలం చినగదిలిలో ఉన్న ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా భీమిలి ఆర్డీవో, వివిధ

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గురువారం ఉదయం గోదాములను సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పని తీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాము లోపల పరిస్థితిని సమీక్షించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్లో సంతకం చేశారు. ఆయన వెంట భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్ రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

భారతరత్న అవార్డు స్థాపన దినోత్సవం

విశాలాంధ్ర - తగరపువలస: భారతరత్న అవార్డు స్థాపన దినోత్సవం విద్యార్థుల సమక్షంలో ఘనంగా జరిగింది. స్థానిక ఒకటవ వార్డు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, బంగ్లామెట్ట నందు ఉదయం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ భారతరత్న భారతదేశంలో పౌరులకు అందే అత్యుత్తమ పురస్కారమని ఇది జనవరి 2, 1954లో భారతదేశ మొదటి రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ చేత స్థాపించబడిందన్నారు. డైట్ సీనియర్ అధ్యాపకుడు

సారిపల్లి త్రినాధరావు మాట్లాడుతూ విద్యాశాఖ జారీ చేసిన ప్రతి అంశాన్ని చక్కగా అమలు చేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు. అధికారుల సందర్శన సమయంలో భద్రపరచుకోవాల్సిన రికార్డులు, రిజిస్టర్లు గురించి వివరించారు. విద్యార్థులతో కలిసి గేయాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుగత మల్లిక, ఛాత్రోపాధ్యాయులు రామకృష్ణ, నవీన్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో గురువారం ఘట్టమనేని రిసార్ట్‌లో విశాలాంధ్ర 2025 నూతన క్యాలెండర్‌ను టీడీపీ సీనియర్ నాయకులు, శ్రీ మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ (బోస్ బాబు) చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ ప్రజల పక్షాన, ప్రజా

సమస్యలు ప్రభుత్వానికి చేరవేసి పరిష్కారం చూపే పత్రిక విశాలాంధ్ర పత్రిక అని పత్రిక సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర భీమిలి నియోజకవర్గం ఇన్చార్జ్ రౌతు నాగరాజు, టీడీపీ నాయకులు సర్పంచులు బిఆర్‌బి నాయుడు, ఆబోతు అప్పలరాము, అప్పలరాజు, ఎర్ర పైడిరాజు, కోరాడ వైకుంఠం, తాత్రాజు. అప్పారావు, బంటుపల్లి .శ్రీను వాసరావు, బుజ్జి, శంకర్రావు, శేఖర్, శ్రీనివాస రావు తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమీషన్ గారి కోర్టు, కానూరు, విజయవాడలో

F.A. No. 616 / 2023

(విశాఖపట్నం జిల్లా వినియోగదారుల ఫోరమ్ విశాఖపట్నం వారిచే CC.No.313/2022)

బిట్వీన్:

ది.జనరల్ మేనేజర్, యస్.బి.ఐ. లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, నటరాజ్, యం.వి.రోడ్ & వెస్ట్రన్ ఎక్స్‌ప్రెస్ హైవే జంక్షన్ అంధేరి(తూర్పు), ముంబాయి-400069 వగైరా ...అప్పిలెంట్స్

మరియు

శ్రీమతి శీలా వెంకట లక్ష్మి ...రెస్పాండెంట్టు,

శ్రీమతి శీలా వెంకట లక్ష్మి, భర్త. నాగరాజు(లేటు), నివాస డోర్.నెం. 12-218, లక్ష్మీనగర్, ఇ-బ్లాక్, గోపాలపట్నం, విశాఖ పట్నం జిల్లా-530027.

పైనెంబరు అప్పీలు పిటీషన్‌లో రెస్పాండెంట్ అయిన మీకు పైస్టేట్ కమీషన్/శ్రీకోర్టువారి ద్వారా, నోటీసు పంపిననూ మీకు ముట్టనందున మీకు ఈపేపర్ ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా పైకోర్టు/స్టేట్‌కమీషన్ వారు ఆర్డరువేస్తూ ది.28-01-2025కి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉ॥గం॥10-30ని॥లకు మీరు స్వయంగాగాని లేక మీ అడ్వకేటు ద్వారా గాని పై కమీషన్ వారి ఎదుట హాజరై మీకుగల అక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీపరోక్షమందు విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది.28-01-2025

మన్నవ శ్రావణ్‌కుమార్, గోవిందు సుధామాధురి,
అప్పిలెంట్స్ తరపు న్యాయవాదులు. "అపరాజిత"
4/19 బ్రాడీపేట, గుంటూరు.సెల్: 94402 60814

ఆర్.ఎస్.బ్రదర్స్ షోరూమ్ శుభారంభం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: వర్తక, వాణిజ్యాలలో సుదూర దృష్టి కలిగిన షాపింగ్‌ప్రియుల సంతోషదాయక గమ్యమైన ఆర్.ఎస్.బ్రదర్స్ విశాఖపట్నంలో అతిపెద్ద షోరూమ్‌ను జగదాంబ సెంటర్‌లో గురువారం శుభారంభం చేసింది. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరై షోరూంను ప్రారంభించారు. సంప్రదాయ వస్త్రప్రియుల్ని, ఇటు అధునాతన జీవనశైలిని అభిమానించే వారిని సమానంగా ఆకర్షించే స్థాయిలో రూపుదిద్దుకోవటం విశేషం. ప్రముఖ సినీతార మీనాక్షి చౌదరి ఈ షోరూమ్‌కు శుభారంభం చేశారు. కొత్త సంవత్సరంలో సరికొత్త షాపింగ్ అనుభవాన్ని అందించే ఈ షోరూమ్‌లోని వైవిధ్యభరిత వస్త్రశ్రేణి చూసి తనకు ఆనందం, ఆశ్చర్యం ఒకేసారి కలిగాయని మీనాక్షి చౌదరి అన్నారు. "ఆర్.ఎస్.బ్రదర్స్ ఒక విశ్వసనీయమైన బ్రాండ్‌గా తెలుగువారు ఏకగ్రీవంగా ఆమోదించారు. అందుబాటు ధరల్లో అత్యంత నాణ్యమైన వస్త్రాలకు పెట్టింది పేరుగా రెండు తెలుగు రాష్ట్రాల వస్త్రప్రియులు ముక్తకంఠంతో ఆమోద ముద్ర వేశారు. విశాఖవాసుల అభిమాన షోరూమ్‌గా ఇది త్వరలోనే ఆదరణ పొందుతుంది. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఈ షోరూమ్ విస్తృతస్థాయిలో అందిస్తున్న

ప్రారంభ ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని విశాఖ నగరవాసుల్ని ఆహ్వానిస్తున్నాను" అన్నారామె. ఆర్.ఎస్.బ్రదర్స్ రీటైల్ ఇండియా ప్రై.లి. డైరెక్టర్లు పి.వెంకటేశ్వర్లు, ఎస్.రాజమౌళి, టి.ప్రసాదరావు విశాఖ పారంపర్య వైభవంగా ఈ అతిపెద్ద సరికొత్త షోరూమ్‌ను సమర్పించడం తమకు గర్వకారణంగా ఉందని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

రెవెన్యూ సదస్సులో 61 ఫిర్యాదులు

విశాలాంధ్ర - ఆనందపురం: రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి కొత్తగా తీసుకొచ్చిన రెవెన్యూ సదస్సులకు విశేష స్పందన లభిస్తుంది. అందులో భాగంగా గురువారం మండల తహశీల్దార్ శ్యామ్ పసాద్ ఆదేశాల మేరకు ఆనందపురం గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో 61 అర్జీలను రైతుల నుండి తీసుకున్నామని, సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని డిప్యూటీ తహశీల్దార్ చేతన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అప్పారావు, స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి, సూరిబాబు, మాజీ వైస్ ఎంపీపీ మీసాల సత్యనారాయణ, అంగటి రాము, రెడ్డి బాబు, బమ్మిడి సూర్యనారాయణ తారక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్య

విశాలాంధ్ర - పెందుర్తి : ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్ సమీపంలోని కృష్ణారాయ పురంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. డి.సంతోషి (ఉష) సంతోష్ దంపతులు గత ఎనిమిది ఏళ్లుగా ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తూ ఇక్కడ నివసిస్తున్నారు. బుధవారం రాత్రి దంపతులిద్దరూ ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు గురువారం స్థానికులు వారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా సిఐ సతీష్ కుమార్ ఎస్ఐ ఆసిరి తాత సిబ్బంది అక్కడికి చేరుకుని క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. అయితే ఆ దంపతులు ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు.

పాఠశాల యాజమాన్యం కమిటీ పాత్రపై శిక్షణ

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల యాజమాన్యం కమిటీ పాత్ర, బాధ్యతలు అనే అంశంపై భీమునిపట్నం పరిధిలోగల ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు,

ఎస్ఎంసి చైర్మన్, ఎస్ఎంసి సభ్యులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్ ప్రారంభ ఉపన్యాసంతో మొదలైంది. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు భీమునిపట్నం మండల విద్యాశాఖ అధికారిణి ఎంఈఓ-1 ఎం.శివరాణి, ఎంఈఓ-2 ఏ.జయప్రద పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్దేశించబడిన ఏడు అధ్యాయాలను రిసోర్స్ పర్సన్లు ఎం.రమాదేవి, పి.సంతోష్ కుమార్, జీడీ ప్రసాద్, సిహెచ్ అమర్నాథ్ వివరించడం జరిగింది. దీన్ని స్టేట్ రిసోర్స్ పర్సన్ కే.సన్యాసినాయుడు పరిశీలించారు.

సీఆర్ఐ పంప్స్‌కి సోలార్ పంపింగ్ సిస్టమ్స్ కోసం ఆర్డర్

విశాలాంధ్ర - విశాఖపట్నం: సుస్థిరత, పునరుత్పాదక ఇంధన పరిష్కారాలపై ఉన్న నిబద్ధతలో కీలక మైలురాయిని సాధించామని సీఆర్ఐ పంప్స్ సగర్వంగా ప్రకటించింది. మగేల్ త్యాలా సౌర్ కృషి పంప్ పథకం కింద రూ.754 కోట్ల విలువైన 25,000 సోలార్ పంపింగ్ సిస్టమ్స్ సరఫరా చేసేందుకు ముంబయికి చెందిన మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌లో సీఆర్ఐ పంప్స్ అధికారికంగా ఎంప్యానెల్ అయింది. ఈ ఎంప్యానెల్‌మెంట్‌తో పునరుత్పాదక ఇంధన పరిష్కారాలు ప్రోత్సహించడం, మహారాష్ట్ర వ్యవసాయ భూభాగాన్ని శక్తివంతం చేయడం, పచ్చదనంతో కూడిన స్థిరమైన భవిష్యత్తుకు దోహదం చేయడంలో కీలక పాత్ర పోషించడానికి (సీఆర్ఐ) పంప్స్ సిద్ధంగా ఉందని సీఆర్ఐ గ్రూప్ చైర్మన్ జి.సౌందరరాజన్ ఈ సందర్భంగా చెప్పారు.

వేములవలస రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ కార్యాలయం

విశాలాంధ్ర -ఆనందపురం: ఆనందపురం మండల వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థ స్థితిలో ఉన్నందున, వేములవలస రైతు సేవా కేంద్రానికి తాత్కాలికంగా మార్చినట్లు వ్యవసాయ అధికారి సంధ్య రత్నప్రభ తెలిపారు. వ్యవసాయ కార్యాలయం మరమత్తులు పూర్తి అవ్వగానే తిరిగి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలోకి మార్చబడునని మార్పుని రైతులందరూ గమనించాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌ని కలిసిన వీఎంఆర్డిఏ చైర్ పర్సన్ ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ గురువారం కలెక్టర్ హరింథిర ప్రసాద్ ని నూతన సంవత్సరం సందర్భముగా కలిసి నోట్ బుక్స్ ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) గాజువాక మండలశాఖ ప్రధాన కార్యదర్శి సబ్బారపు నూకరాజు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్థానిక మండల విద్యాశాఖ అధికారులు విశ్వనాథం, సునీతకి ఉపాధ్యాయ నాయకులు పుష్పగుచ్చములతో నూతన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. అదే విధంగా అధికారులు చేతుల మీదుగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ '2025 సంవత్సరమునకు చెందిన క్యాలండర్, డైరీ ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమంలో గాజువాక మండలం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, సబ్బారపు నూకరాజు, సహ అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ హక్, జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్, మండల నాయకులు రాంబాయి, అపరంది, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సెబీ వద్ద ఎ వన్ స్టీల్స్ ఇండియా డీఆర్ హెచ్పీ దాఖలు

విశాలాంధ్ర,- విశాఖపట్నం: దక్షిణ భారతదేశంలో ఐదుగురు ఉక్కు ఉత్పత్తిదారులు 10 ఉక్కు ఉత్పత్తులు మరియు పారిశ్రామిక ఉత్పత్తులను తయారు చేస్తున్న ఏకైక కంపెనీ ఏ ఒన్ స్టీల్స్ ఇండియా లిమిటెడ్ తన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డి ఆర్ హెచ్ పి)ని మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ("సెబి")లో ఫైల్ చేసింది. కంపెనీ ఈక్విటీ షేర్ల ఆఫర్ ద్వారా (ఒక్కొక్కటి ముఖ విలువ రూ.10) ప్రారంభ పబ్లిక్ ఆఫర్‌ల ద్వారా రూ.65,000 లక్షల రూ.650 కోట్లు వరకు నిధులను సేకరించాలని యోచిస్తోంది. మొత్తం ఆఫర్ పరిమాణంలో రూ. 60,000 లక్షల వరకు రూ. 600 కోట్లు ("తాజా ఇష్యూ") ఈక్విటీ షేర్‌ల తాజా ఇష్యూ ఉంటుంది. రూ. 5000 లక్షలు రూ. 50 కోట్లు ("ఆఫర్) విక్రయించే వాటాదారుల ద్వారా అమ్మకానికి ఆఫర్ అమ్మకానికి"). ఏ వన్ స్టీల్స్ ఇండియా రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ద్వారా అందించబడే ఈక్విటీ షేర్లను బీ ఎస్ ఈ లిమిటెడ్ మరియు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఎన్ఎస్ఇలో జాబితా చేయాలని ప్రతిపాదించబడింది.

పాఠశాల అభివృద్ధిపై శిక్షణ

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 60వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీ జీవీఎంసీ హైస్కూల్లో పాఠశాల అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఎస్ఎంసి చైర్మన్/చైర్ ర్సన్ కు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు గురువారం మన పాఠశాలను ఏ విధంగా అభివృద్ధి. చేసుకుందాం అనే అంశంపై ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల విద్యాధికారులు పర్యవేక్షణలో రిసోర్స్ పర్సనల్ ఎమ్మెస్ ప్రకాష్‌రావు, టి.రామారావు, ఏవి రమణ, స్వాతి, లక్ష్మి, నాగమణి ఎస్ఎంఎస్ సభ్యులు శిక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ త్రినాథ్ మాట్లాడుతూ ఇక్కడ పొందిన అనుభవాలు మీ పాఠశాల అభివృద్ధికి ఉపయోగపడేటట్లుగా ఇతర సభ్యులందరికి ఈ నెల 6వ తేది లోపల శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - పీఎంపాలెం: నగరంలోని మధురవాడ ఆర్డో వార్డు కొమ్మాది ఎస్ఎస్‌విడి అపార్ట్‌మెంట్‌లో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపార్ట్‌మెంట్‌లో 401లో నివాసముంటున్న అరవింద్ ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈయన గతంలో ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక వద్ద పీఏగా పని చేశారు. ఈయన ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

కళలు కాపాడుకోవాలి: ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - పీఎం పాలెం: చేనేత, హస్త కళలు అంతరించిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి మీద ఉందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మధురవాడ శిల్పారామంలో 15 రోజుల పాటు జరగనున్న అఖిల భారత చేనేత వస్త్ర ప్రదర్శనను గురువారం ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంటిల్లపాది రోజుల తరబడి కష్టపడితే గానీ ఒక చేనేత వస్త్రం గానీ ఒక కొయ్య బొమ్మ గానీ తయారు చేయలేరన్నారు. తమ కష్టానికి తగ్గ ఆర్థిక ఫలితం లేక వదిలేస్తే ఆ కళ పూర్తిగా కనుమరుగైపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో నైపుణ్యం గల వీరిని కార్మికులుగా కాకుండా కళాకారులుగా గుర్తించాలని కోరారు. ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యంతో పాటు సబ్సిడీలు, బ్యాంకు రుణాలు, ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా సింహాచలం కొండపైన దేవస్థానం ఉద్యోగి పద్మనాభ రాజు ఏటికొప్పాక బొమ్మ ఇవ్వడం తనకు ఆనందం కలిగించిందని, హస్త కళలను ప్రోత్సహించేలా ఇలాంటి బొమ్మలను బహుమతులుగా ఇవ్వాలని సూచించారు. ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు 87 స్టాల్స్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జనసేన భీమిలి ఇంచార్జీ పంచకర్ల సందీప్, కార్పొరేటర్లు మొల్లి హేమలత, లొడగల అప్పారావు, పిల్లా మంగమ్మ, కూటమి నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, దాసరి శ్రీనివాస్, జీవన్ కుమార్, గరే గుర్నాథ్, శాఖారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రీసెర్చ్ పార్కులు ఏర్పాటు చేయాలి

పిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు

విశాలాంధ్ర - పెందుర్తి : ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులకు రీసెర్చ్ పార్కులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ,ఓటీసీ డిపార్ట్మెంట్ ఇంచార్జ్ మూల వెంకటరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ పార్కుల వల్ల సాంకేతిక, పరిశోధన రంగంలో మంచి ఫలితాలు వస్తాయని. పరిశ్రమలలో పరిశోధన సహకారానికి వేదికలుగా పని చేస్తాయని ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి ఉపయోగ పడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ పార్కులతో ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యా విధానం వైద్య విద్యకు మరింత దగ్గరవుతుందని అభిప్రాయపడ్డారు. ఎం.బి.బి.ఎస్ లో క్లాసు రూమ్ పాఠాలు చాలా వరకు రెండవ సంవత్సరంతోనే పూర్తవుతాయని, ఆ తరువాత చదువంతా ఆసుపత్రిలో రోగులను ప్రత్యక్షంగా చూస్తూనే సీనియర్ విద్యార్థులు, చీఫ్ లు అప్పటికప్పుడు, అక్కడికక్కడ సందర్భానుసారంగా ఇచ్చే బోధన ఆధారంగా సాగుతుందన్నారు. ఈ అనుభవం మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న ఆసుపత్రి వల్ల వస్తుందని, రోగికి జరిగే చికిత్సలో వైద్య విద్యార్థి చదువుకుంటున్నప్పుడు ఏం చేస్తాడో చదువు అయ్యాక కూడా అదే చేస్తాడని పేర్కొన్నారు. ఆ అనుభవంతో చాలామంది డాక్టర్లు సొంతంగా క్లినిక్‌లు, నర్సింగ్ హోమ్‌లను ప్రారంభించి స్వయం ఉపాధి మార్గంలోకి ప్రవేశిస్తారని, ఇలాంటి ఒరవడినే అనుసరిస్తూ ఇంజనీరింగ్ కాలేజీల్లో రీసెర్చ్ పార్కులు ఏర్పాటు చేయాలని కోరారు. వీటివల్ల విద్యా దశకు,ఉద్యోగ దశకు మధ్య అంతరాలు తగ్గుతాయని. ఇంజనీరింగ్ విద్యార్థులకు స్వయం ఉపాధి మార్గంలో ప్రవేశించడానికి కావలసిన శిక్షణ దొరుకుతుందన్నారు. ఎంతో ఎత్తుకు ఎదగడానికి ప్రయత్నిస్తున్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు తమకు ఎవరు ఉద్యోగం ఇస్తారని కాకుండా, తాము ఇప్పుడు ఎవరికి ఉద్యోగం ఇవ్వాలి అనే స్థాయికి ఎదుగుతార ని మూల వెంకటరావు స్పష్టం చేశారు. కావున ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి ఇంజనీరింగ్,ఫార్మసీ కాలేజీలో రీసెర్చ్ పార్కులు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ముక్కోటి ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు

- ఆలయ పరిపాలనాధికారి రమాబాయి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఈనెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలను అల్లిపురం వెంకటేశ్వర్ల మెట్టపై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఆలయ పరిపాలనాధికారి జి. వి.రమాబాయి తెలిపారు. పదో తేదీ తెల్లవారుజామున ఒంటిగంట నుండి ఆరాధన, నివేదన, శ్రీ స్వామి వారి ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ, ఉదయం 3 గంటలకు స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, ఆలయ మండపంలో ప్రథమ అర్చన, సహస్రనామార్చన నిర్వహిస్తారన్నారు. ముందుగా 50 రూపాయలు దేవస్థానంలో చెల్లించి గోత్రనామాలు నమోదు చేయించుకున్న వారు ఉదయం 11 గంటలకు నిర్వహించే సహస్రనా మార్చనలో పాల్గొన వచ్చు. 11న కూడార్రై ఉత్సవం, 12వ తేదీన ఉదయం 6 గంటలకు శ్రీ అమ్మవారికి నీరాటోత్సవం, విశేష తిరుమంజన సేవ,స్వామివారిని, గోదాదేవిని కళ్యాణ దంపతులుగా అలంకరిస్తారు. 13వ తేదీ భోగి పండుగ సందర్భంగా ఉదయం 5 గంటలకు అర్చనలు, 10 గంటలకు గోదాదేవికి శ్రీ రంగనాయకకు కళ్యాణం జరుగుతుందన్నారు. 14వ తేదీ మకర సంక్రాంతి పండుగ సందర్భంగా ఉదయం ఐదు గంటలకు స్వామి వారికి విశేష అర్చనలు జరుగుతాయి. 15వ తేదీ కనుమ పండుగ సందర్భంగా ఉదయం 5గంటలకు ప్రాతః కాలార్చన, నివేదన, నీరాజన మంత్రపుష్పం, తిరువీధి మహోత్సవం, 16వ తేదీ ముక్కనుమ పండుగ సందర్భంగా పరస మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారన్నారు. 19వ తేదీన అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ జీవీ రమాబాయి తెలియజేశారు. వైకుంఠ ఏకాదశి, గోదాదేవి కల్యాణం పరస మహోత్సవ వేడుకల్లో భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కూటమి పాలన అట్టర్ ఫ్లాప్: ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: రాష్ట్రంలో ఏడు నెలల కూటమిపాలన అట్టర్ ఫ్లాప్ అయ్యిందని వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. గురువారం వైసీపీ జిల్లా కార్యాలయంలో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత మేనిఫేస్టోను టిడిపి వెబ్ సైట్ నుంచి తీసేస్తే నేడు మేనిఫేస్టోను చంద్రబాబు తన మెమరీ నుంచి తీసేశారని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ముఖ్యంగా మహిళల భద్రత గాలిలో దీపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసంపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. జగన్ హయాంలో విద్యాంధ్రప్రదేశ్, కూటమి హయాంలో మద్యాంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. ప్రతి పల్లెలోలనూ ఎనీ టైం మద్యం దొరుకు తోందన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు సాగుతు న్నాయని, సీఎం నియోజకవర్గం కుప్పంలోనూ గంజాయి సాగు నిర్వహిస్తున్నారని విమర్శించారు. మహిళలపై దాడులు పెరుగు తున్నాయని, రాష్ట్రంలోని మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు విజనరీ పాలనను అందిస్తామని చెప్పి గజినీపాలెం చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ కాస్తా సూపర్ షాక్‌గా మారిపోయిందని, మహాశక్తి పథకం... మహామోసంగా, తల్లికి వందనం కాస్తా పిల్లల పాలిట శాపంగా, యువగళం కాస్తా హామీలకు మంగళంగా మారిపోయిందని, ఉచిత బస్సు కాస్తా ఉత్తుత్తి బస్సుగా మారిపోయిందని ధ్వజమెత్తారు.

మధురవాడ అభివృద్ధికి తోడ్పడండి

విశాలాంధ్ర - పీఎం పాలెం: భీమిలి నియోజకవర్గం సమీక్ష సమావేశంలో భీమిలి శాసనసభ్యులు గంటా సమక్షంలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ముఖ్యంగా నగరంపాలెం మాస్ ప్లాన్ రోడ్ త్వరిత గతిన పూర్తి చెయ్యాలని, వర్షం పడితే మధురవాడ ఫ్లైఓవర్ దగ్గర నీటి నిల్వ సమస్య వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. ఆసమస్యకు సత్వరమే పరిష్కారం చూపాలని, జీవీఎంసీ జోన్-2 పరిధిలో గల చెరువులలో 5వ వార్డుకు చెందిన సర్వే నెంబర్ 61లోని బొట్టవాని పాలెం వెంపల చెరువు, సర్వే నెంబర్ 65లోని నగరంపాలెం రాళ్ల చెరువులు ఒకప్పుడు ప్రజలకు, పంట పొలాలకు స్వచ్ఛమైన నీరు అందించేవని, కానీ ఎన్నో ఏళ్లుగా పునరుద్ధరణకు నోచుకోకపోవడం వలన నీటి సామర్థ్యం తగ్గిపోయి కళావిహీనంగా మారాయన్నారు. శారదానగర్ కాలనీ కొండ ఎగువ భాగంలో వాటర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించాలని తదితర అంశాలపై సమీక్ష సమావేశంలో భీమిలి శాసన సభ్యులు గంటా సమక్షంలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సమస్యపై శాశ్వత పరిష్కారాన్ని చూపాలని కార్పొరేటర్ కోరారు.

సంక్షేమం వైపు కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర - భీమిలి: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదుకు అన్ని వర్గాల ప్రజల నుండి విశేష స్పందన వస్తుందని భీమిలి జోన్ 3వ డివిజన్ అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు సూచనలు మేరకు 3వ డివిజన్ కాళ్ళవీధిలో గంటా నూకరాజు ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశానుసారం నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాల నమోదుకు చేరువలో ఉన్నామని అన్నారు. మహిళలు, యువత, విద్యార్థులు అధికసంఖ్యలో నమోదు కొరకు ముందుకు వస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి నిదర్శనమని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్ళుగా చేసుకొని పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు పూర్తి విశ్వాశంతో ఉన్నారని గంటా నూకరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, మారోజు సంజీవకుమార్, సంకురుభుక్త జోగారావు, కొక్కిరి అప్పన్న, శంకర్ రెడ్డి, వాడమొదలు తవుడయ్య తదితరులు ఉన్నారు.

విభిన్న తరహా శారీలతో బుట్ట బొమ్మ షోరూమ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: చేనేత వస్త్రాలకు ఆదరణ కల్పిస్తూ వ్యాపారం కొనసాగిస్తున్న బొమ్మన సంస్థ బుట్ట బొమ్మ పేరిట శారీ స్టోర్ ను మద్దిలపాలెంలో ప్రారంభించడం సంతోషదాయకమని వీఎంఆర్ డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదురుగా ఇటీవల ప్రారంభించిన బుట్టబొమ్మ షోరూంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు మెచ్చే విభిన్న డిజైన్లతో కూడిన వస్త్రాలు బుట్ట బొమ్మ శారీ స్టోర్‌లో అందుబాటు ధరల్లో

లభ్యమవుతున్నా యన్నారు. మహిళలు బుట్ట బొమ్మ షోరూంలో కొనుగోలు చేసి ఆదరించాలన్నారు. చేనేత రంగంపై ఆధారపడిన వారిని ప్రోత్సహించాలనే ఆశయంతో బొమ్మన కుటుంబం సుదీర్ఘ కాలంగా వస్త్ర వ్యాపారం చేస్తూ విశేషంగా ప్రజాదరణ పొందిందన్నారు. మద్దిలపాలెం వద్ద సొంత భవన సముదాయంలో బుట్ట బొమ్మ శారీ స్టోర్‌ను ప్రారంభించడం వల్ల తక్కువ ధరకు వస్త్రాలు విక్రయించడానికి వీలుకలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మన అధినేత బొమ్మన సత్యరాజ్ కుమార్, బొమ్మన సునీత, బొమ్మన మణిరాజ్, బొమ్మన యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గంటాను కలిసిన భాగం

విశాలాంధ్ర - భీమిలి: మాజీ మంత్రి భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావును మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాసేపు పలు సమస్యలను శాసనసభ్యులు దృష్టికి తీసుకెళ్లినందుకు అందుకు శాసనసభ్యులు సానుకూలంగా స్పందించారని తెలిపారు.